క్లుప్తంగా

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

తెనాలిరూరల్: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు కేసు నమోదు చేస్తారన్న భయంతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేశాడు. వివరాలిలా ఉన్నాయి. తెనాలి మండలం కోపల్లె గుడివాడకు చెందిన ఏసోబు, చలపతి మంగళవారం రాత్రి కొలకలూరులోని వైన్ షాపులో ఆరు మద్యం సీసాలు తీసుకున్నారు. గ్రామానికి వెళుతుండగా ఎస్ఈబీ అధికారులు వీరి వద్ద మద్యం సీసాలు గుర్తించారు. ఏసోబు గతంలో అక్రమ మద్యం విక్రయం కేసులో నిందితుడిగా ఉండడంతో అతని మోపెడ్‌ను ఎస్ఈబీ అధికారులు స్వాధీనం చేసుకుని బైండోవర్ చేసేందుకు బుధవారం ఉదయం కార్యాలయానికి రావాలని సూచించారు. దీంతో కేసు నమోదు చేస్తారన్న అనుమానంతో ఏసోబు కార్యాలయానికి వెళ్లి తాను పురుగుల మందు తాగినట్టు సిబ్బందికి చెప్పడంతో హుటాహుటిన వారు తెనాలి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను వన్‌టౌన్ పోలీసులు రికార్డు చేశారు. అయితే తన భార్యతో ఘర్షణ జరుగగా పురుగుల మందు తాగినట్టు కూడా ఏసోబు చెబుతున్నాడని పోలీసులు తెలిపారు. విచారించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుంటూరు రూరల్: నగర శివారుల్లోని బుడంపాడు నారాకోడూరు మధ్యనున్న రుచి దాబా వద్ద రోడ్డు పక్కన గుర్తు తెలియని వ్యక్తి స్పృహ తప్పిపడిపోయి, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన బుధవారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం సుమారు 55 సంవత్సరాల వయస్సుగల వ్యక్తి రోడ్డు పక్కన స్పృహ కోల్పోయి పడి ఉన్నాడని సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలికి చేరుకుని అతనిని 108లో చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారన్నారు. చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడన్నారు. ఆచూకీ తెలిసిన వారు 8688831378, 8688831376 సెల్ నంబర్లను సంప్రదించాలన్నారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

రాజీనామాలు చేస్తున్న వలంటీర్లు

తాడేపల్లిరూరల్: మంగళగిరి నియోజకవర్గంలో వలంటీర్ల రాజీనామా కొనసాగుతోంది. తాజాగా బుధవారం దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరులో 13 మంది రాజీనామా పత్రాలను సచివాలయ సెక్రటరీకి అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు రాజకీయాలకు, కులమతాలకు అతీతంగా పేద ప్రజలకు అందాలనే ఉద్దేశంతో వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేశారని, అలాంటి వారిపై ప్రతిపక్షాలు రాజకీయాలు చేస్తూ వారి నోటికి వచ్చినట్లు మాట్లాడి, వృద్ధులను, వికలాంగులను తీవ్ర ఇబ్బందులను గురిచేశారని ఆరోపించారు. కంఠంరాజు కొండూరులో రాజీనామా చేసిన వారిలో కావూరి అశోక్‌బాబు, రావూరి సురేష్, పెండ్యాల పవన్‌బాబు, గోసాల జీవన్ కిషోర్, తాడిబోయిన శ్రీకాంత్, దేశబోయిన సుమలత, సయ్యద్ అస్మ, తొలిచూరి ఆశ, షేక్ నాగుల్ షరీఫ్, కొండూరు నిర్మల, జొన్నాదుల బేబీ లక్ష్మి, షేక్ రజియా, తాడిబోయిన వెంకట సుధీర్ ఉన్నారు.

తాడికొండలో 17 మంది..

తాడికొండ: గ్రామంలో 17 మంది వలంటీర్లు స్వచ్ఛందంగా బుధవారం రాజీనామా సమర్పించారు. సీఎంగా మళ్లీ వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని గెలిపించుకొని మరింత ప్రజాసేవ చేసేందుకు తమవంతు కృషి చేస్తామని తెలిపారు.

ఉరి వేసుకుని గుర్తుతెలియని వ్యక్తి మృతి



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని బ్రహ్మానందపురం ఎయిమ్స్ రోడ్‌లో గుర్తు తెలియని యువకుడు చెట్టుకు ఉరివేసుకుని ఉన్నట్లు స్థానికులు వీఆర్‌ఓ విన్నయ్యకు బుధవారం సమాచారం ఇచ్చారు. స్పందించిన ఆయన తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సాయిప్రసాద్‌తో కలసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు అందించిన వివరాలు.. మృతుడి ఒంటిపై బ్లూ కలర్ మీద వైట్ మచ్చలు ఉన్న ఫుల్ హ్యాండ్స్ నెక్ టీషర్ట్, పాచిరంగు నైట్ ప్యాంటు, మట్టిరంగు షూ ధరించి ఉన్నాడని, అతడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని, జరిగిన ఈ ఘటనపై ఆత్మహత్య కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఇదిలా ఉండగా ఉరి వేసుకున్న వ్యక్తి ఎడమ చేతితో ఉరితాడుని పట్టుకుని ఉన్నాడు ఎవరైనా ఉరి వేసుకుంటే సాధారణంగా రెండు చేతులు కిందకు వేళాడతాయి. చనిపోయిన వ్యక్తి బలవంతంగా తాడు మెడకు వేసి పైకి లాగుతున్నప్పుడు తాడు పట్టుకున్నట్లు కనిపించడం విశేషం. పోలీసులు మాత్రం ఇది ఆత్మహత్యగానే కేసు నమోదు చేశారు.

రూ.77,500 నగదు స్వాధీనం

తాడికొండ: నిబంధనలకు విరుద్ధంగా నగదు తీసుకెళ్తున్న మహిళ వద్ద నుంచి రూ.77,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తాడికొండ సీఐ సీహెచ్ ప్రభాకర్ తెలిపారు. తాడికొండ అడ్డరోడ్డులోని పోలీస్ చెక్‌పోస్టు వద్ద ఎస్ఐ జి.అంకమ్మ తనిఖీలు చేస్తుండగా తుళ్లూరు మండలం శాఖమూరు గ్రామానికి చెందిన తలతోటి హవీల అనే మహిళ వద్ద రూ.77,500 నగదు లభించినట్లు వెల్లడించారు. తగిన రసీదులు చూపించకపోవడంతో నగదును సీజ్ చేసి ఐటీ అధికారులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు.

రంజాన్ పర్వదిన ప్రార్థనలకు సర్వం సిద్ధం



ఈద్గాలోని మక్కా తరహా నిర్మాణం



ఈద్గాలోని చలువ పందిళ్లను పరిశీలిస్తున్న కమిషనర్

వేసవి తీవ్రత దృష్ట్యా ప్రత్యేక ఏర్పాట్లు

తెనాలి: పవిత్రమైన రంజాన్ పర్వదినం రోజు ముస్లిం సోదరులు ప్రార్థనలు జరుపుకునేందుకు పట్టణంలోని ఈద్గాలు సిద్ధమయ్యాయి. ప్రధానంగా భారీ సంఖ్యలో హాజరయ్యే చెంచుపేటలోని ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు, సమీప సమాధుల స్థలంలో పెద్దలకు నివాళులర్పించే కార్యక్రమం నిర్వహిస్తారు. కొద్ది రోజులుగా కొనసాగుతున్న వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఈద్గాలో ముస్లిం సోదరులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఉండేలా ఈద్గా కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రాంగణంలో చలువ పందిళ్లు (పెండేలు)వేయించారు. ఈద్గాకు ముందు రోడ్డు పైనా పందిళ్లను ఏర్పాటు చేశారు. ప్రార్థన సమయంలో కూర్చొనేందుకు వీలుగా మ్యాట్‌లు సిద్ధం చేశారు. వేడి తగలకుండా కూలర్ల ఏర్పాటు మరో ప్రత్యేకత! ఈ ఏర్పాట్లతోపాటు వాటర్ బాటిళ్లు కూడా సిద్ధం చేసినట్టు ఈద్గా అధ్యక్షుడు సయ్యద్ గౌస్ వెల్లడించారు. ఆయా ఏర్పాట్లను కమిటీ సభ్యులతోపాటు ఆయన దగ్గరుండి పర్యవేక్షించారు. ఈద్గా ప్రాంగణం, సమాధుల స్థలంలో పారిశుద్ధ్య నిర్వహణను గత రెండురోజులుగా మున్సిపల్ సిబ్బంది పూర్తి చేశారు. ఆయా ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆరోగ్య అధికారులతో కలిసి బుధవారం స్వయంగా పరిశీలించారు. రంజాన్ రోజున నియోజకవర్గంలోని 42 మసీదులకు చెందిన ముస్లిం సోదరులు ఏటా ఏడెనిమిది వేల మంది వస్తుంటారని, ఈ పర్యాయం 10 వేలకుపైగా హాజరవుతారని అంచనా వేస్తున్నట్టు సయ్యద్ గౌస్ చెప్పారు. ముతవల్లీలంతా మర్కజ్ మసీదులో మషూరా చేసుకుని, ఈద్గాలో నమాజు ఎవరిచే చదివించాలని నిర్ణయం తీసుకుంటామని చెబుతూ ఈసారి మారీసుపేట మసీదుకు చెందిన ముఫ్తీ అనసాబ్ నమాజ్ చదివిస్తారని వివరించారు. గురువారం ఉదయం 9.30 గంటలకు నమాజ్ చదవటం ఆరంభమవుతుందని తెలిపారు. తెనాలిలోని 22 మసీదుల అధ్యక్షులు, ముస్లిం పెద్దల సహకారంతో రూ.12 లక్షల వ్యయంతో ఈద్గా, సమాధుల స్థలం అభివృద్ధికి చర్యలు తీసుకున్నట్టు గుర్తు చేశారు. ముఖ్యంగా మినార్‌లు, ప్రహరీగోడల నిర్మాణంతో నూతన శోభను సంతరించుకున్నాయని అందరూ కమిటీని అభినందిస్తున్నట్టు చెప్పారు.



మసీదు వెలుపల రహదారిలో చలువ పందిరి



కమిటీ సభ్యులతో అధ్యక్షుడు సయ్యద్ గౌస్



పరిశుభ్రం చేసిన సమాధుల స్థలం



తెనాలిలో కనిపించిన నెలవంక

పూర్ణ ప్రజ్ఞాచారి సాహితీ సేవ శ్లాఘనీయం



పూర్ణ ప్రజ్ఞాచారిని సత్కరించిన ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: సాహితీ రంగంలో నూతక్కి పూర్ణ ప్రజ్ఞాచారి తన ప్రతిభతో నియోజకవర్గానికి పేరుప్రఖ్యాతలు తీసుకురావటం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. రూరల్ మండలం కొలకలూరు గ్రామానికి చెందిన కవి పూర్ణ ప్రజ్ఞాచారి జన్మదినం సందర్భంగా బుధవారం స్థానిక జై భీమ్ ఫెడరేషన్ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు కొవెవరపు దేవానంద్ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సత్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ తండ్రి నూతక్కి అబ్రహాం అక్షర వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని దళితుల స్థితిగతులపై అధ్యయనం చేసి ఎన్నో రచనలు, కావ్యాలను రచించటం అభినందనీయమని అన్నారు. సాహితీ రంగంలో తెనాలికి మరింత ఖ్యాతిని తీసుకురావాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. కొవెవరపు దేవానంద్ మాట్లాడుతూ మధురకవి నూతక్కి అబ్రహాం విగ్రహాన్ని తెనాలి బండ్‌పై ఏర్పాటు చేసేలా ఎమ్మెల్యే శివకుమార్ చొరవ చూపాలని కోరారు. బిషప్ కత్తెర సుధీర్‌కుమార్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కొలకలూరు గ్రామ అధ్యక్షుడు ప్రసాదం సురేష్, పార్టీ జిల్లా నాయకుడు కొమ్ము రాయల్, నూతక్కి ఆచారి, నూతక్కి స్వరాజ్ పాల్గొన్నారు.

ఓటు ప్రాధాన్యత తెలుసుకోండి



మాట్లాడుతున్న కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కుకు ఎంతో ప్రాధాన్యత ఉందని దానిని గుర్తెరిగి అందరూ తమ ఓటు హక్కును వచ్చే ఎన్నికల్లో వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్వీప్ కార్యక్రమంలో భాగంగా పురపాలక సంఘం ఆధ్వర్యంలో బుధవారం తెనాలి మండలం సంగంజాగర్లమూడి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఓటు వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 13న జరిగే ఎన్నికల్లో ఓటు ద్వారా మంచి పాలకులను ఎన్నుకోవాలని తెలిపారు. అందరూ స్వచ్ఛందంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. రాజకీయ పార్టీల ప్రలోభాలకు లోను కాకుండా ఓటు వేయాలన్నారు. అనంతరం ఓటు వేస్తామనే ప్రతిజ్ఞను అందరితో చేయించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ అనూష, ఏసీపీ సుబ్బారావు, మెప్మా సీఎంఎంలు మాధవరావు, అరుణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరావు, రామచంద్రరావు, సచివాలయ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వేసవిలో గర్భిణులు, చిన్నారులు జాగ్రత్తలు పాటించాలి

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ సభ్యురాలు పద్మావతి



అంగన్‌వాడీ కేంద్రంలో కోడి గుడ్లను పరిశీలిస్తున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ సభ్యురాలు పద్మావతి

కొల్లిపర: వేసవిలో గర్భిణీలు, చిన్నారులు వైద్యులు, అంగన్‌వాడీ కేంద్రాలల్లో అధికారులు సూచిస్తున్న సూచనలు, సలహాలు పాటిస్తూ, ప్రతి నెల ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం తీసుకోవాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు. మండలంలోని వల్లభాపురం గ్రామంలోని హైస్కూల్, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు.

గర్భిణులు, చిన్నారులకు ప్రభుత్వం ప్రతి నెల అందిస్తున్న పౌష్టికాహారం ఇస్తున్నారా లేదా అని గ్రామంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. ఆయా కార్యాలయాలలో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, చిన్నారులు, బాలింతల్లో రక్తహీనత నివారణకు ప్రభుత్వం అందిస్తున్న ఫోర్టిఫైడ్ రైస్‌ను వినియోగించాలని అన్నారు. గర్భిణులు ఎక్కువగా ఆకుకూరలు, ఐరన్ మాత్రలు తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో గైర్హాజరయిన పిల్లల మీద ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, డ్రాప్ అయిన పిల్లలపై దృష్టి పెట్టాలని విద్యాశాఖను ఆదేశించారు. ప్రతి పాఠశాలలో గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై బాలికలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సాల్మన్ రాజు, అంగన్‌వాడీ సూపర్ వైజర్ నాగమణి, వెల్ఫేర్ అసిస్టెంట్ గోపాలకృష్ణ , అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నందివెలుగులో ఎన్నికల ప్రచారం



సంక్షేమ పథకాలు కరపత్రాలను అందజేస్తున్న సత్యనారాయణ

తెనాలిటౌన్: మండలంలోని నందివెలుగు గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చేస్తున్న ఎన్నికల ప్రచారం బుధవారం అయిదో రోజుకు చేరింది. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తనయుడు సత్యనారాయణ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. ఆయన ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేస్తున్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మళ్లీ రావాలని ఈ సందర్భంగా సత్యనారాయణ అన్నారు. మే 13న జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో గుంటూరు పార్లమెంటు అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్‌లను గెలిపించాలని కోరారు. ప్రచారంలో మండల పార్టీ అధ్యక్షుడు చెన్నుబోయి శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ ధూళిపాళ్ళ పవన్‌కుమార్, గ్రామ కన్వీనర్ కానుగోలు సురేష్, ఉప సర్పంచ్ మంగా శివనాగేశ్వరరావు, పార్టీ నాయకులు బొంతు నరేంద్రరెడ్డి, వేముల మహేష్, కమాదుల స్వామి, బెజ్జం బాజీ, మంగా చిట్టిబాబు, కసుకుర్తి దానియేలు, గొర్రె వెంటేశ్వరరావు, తోటకూర వసంతరావు, షేక్ చినగాలీషా, శాంతిరాజు, నవనీతం నాగేశ్వరరావు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు పినపాటి అనిల్, వట్టిప్రోలు అశోక్, సిరి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బ్లేడుతో భార్య గొంతు కోసిన భర్త



పెదకాకాని: కోర్టు పరిధిలో ఉన్న కేసును ఉపసంహరించుకోలేదనే కోపంతో భర్త బ్లేడుతో భార్య గొంతు కోసిన సంఘటన పెదకాకానిలో చోటు చేసుకుంది. పెదకాకాని వెంగళరావునగర్ ప్రాంతానికి చెందిన సయ్యద్ షామీర్ అదే ప్రాంతానికి చెందిన తస్లీమ్‌ను ఏడాదిన్నర కిందట ప్రేమ వివాహం చేసుకున్నాడు. వారికి సంవత్సరం వయసున్న బాబు ఉన్నాడు. వివాహమైన కొద్ది రోజులకే షామీర్ వేధింపులు భరించలేని భార్య పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు గృహహింస, వరకట్నం వేధింపులపై కేసు నమోదు చేశారు. ఆ కేసు ప్రస్తుతం న్యాయస్థానం పరిధిలో ఉంది. ప్రస్తుతం ఇద్దరూ పుట్టింటికీ, అత్తంటికీ దూరంగా ఇల్లు అద్దెకు తీసుకుని జీవనం సాగిస్తున్నారు. షామీర్ తరచూ భార్యను కేసు ఉపసంహరించుకోవాలని ఒత్తిడి తెస్తున్నాడు. కేసు ఉప సంహరించుకుంటే గతంలో మాదిరిగా వేధింపులకు గురిచేస్తాడని ఆమె అందుకు నిరాకరించింది. దీంతో కోపోద్రిక్తుడైన షామీర్ బుధవారం ఒక పథకం ప్రకారం బ్లేడుతో భార్య గొంతు కోశాడు. స్థానికుల ఫిర్యాదు మేరకు అక్కడికి చేరుకున్న పోలీసులు చికిత్స నిమిత్తం రక్తస్రావం అవుతున్న తస్లీమ్‌ను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నిందితుడు సయ్యద్ షామీర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ కె.వీరాస్వామి తెలిపారు.

వైఎస్సార్‌సీపీతోనే మెరుగైన సంక్షేమం



కరపత్రాలు పంపిణీ చేసి ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే సతీమణి పుష్ప, చైర్‌పర్సన్ రాధిక

తెనాలిఅర్బన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రానున్న ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి వస్తే ప్రజలందరికీ మరింత మెరుగైన సంక్షేమ ఫలాలు అందిస్తుందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సతీమణి పుష్ప, మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధికలు పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం సాయంత్రం 28వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని తెలియజేసి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరి నల్లూరి లక్ష్మి సాంబ్రాజ్యం, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి, కౌన్సిలర్లు యాతాటి అనిల్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఆళ్ళమూరి విజయలక్ష్మికుమారి, వైఎస్సార్‌సీపీ నాయకులు మట్లపూడి రాజేశ్వరరావు, చుండూరు సాయి, చెరుకూరి సురేష్, చుండూరు వెంకటేశ్వరరావు, చుక్కా ఆనంద్, పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోల్ట్ స్టోరేజీ యజమాని ఆస్తులపై ఆంక్షలు విధించాలి

- విక్రయం, తనఖాకు అవకాశం లేకుండా చూడాలి
- సబ్ కలెక్టర్‌తో పసుపు రైతుల సంఘం నేతల వినతి



ప్రఖర్ జైన్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు నాయకులు

తెనాలి: దుగ్గిరాలలోని శుభం మహేశ్వరి కోల్ట్ స్టోరేజీ యజమాని తన ఆస్తులను విక్రయించకుండా, తనఖా పెట్టకుండా సబ్ రిజిస్ట్రార్‌కు తగిన ఆదేశాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ పసుపు రైతుల సంఘం నాయకులు కోరారు. ఆ ప్రకారం బుధవారం తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. యజమాని నిర్లక్ష్యం కారణంగా కోల్ట్ స్టోరేజిలోని రూ.120 కోట్ల పసుపు పంట దగ్ధమైందని తెలిపారు. కోల్ట్ స్టోరేజి బ్యాంకు ఖాతాలను సీజ్ చేయించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం నియమించిన కమిటీ సిఫార్సు మేరకు క్వింటాలుకు రూ.12,500 ఇప్పించేలా చూడాలన్నారు. ముందుగా నష్టపోయిన రైతులకు బీమా పరిహారం చెల్లించి, యజమానికి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, బోగస్ రైతులకు కాకుండా నిజంగా నష్టపోయిన రైతులకే పరిహారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్ మాట్లాడుతూ రైతులు, కోల్ట్ స్టోరేజి యజమానికి సమావేశం ఏర్పాటు చేసే విషయం పరిశీలిస్తానని చెప్పారు. కోల్ట్ స్టోరేజి అగ్నిప్రమాదంపై ఇంకా రెండు శాఖలకు చెందిన నివేదికలు రావాల్సి ఉందని, రైతాంగం అభిప్రాయాలను కలెక్టరు దృష్టికి తీసుకెళతానని హామీనిచ్చారు. బాపట్ల జిల్లా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వేములపల్లి వెంకట్రామయ్య, గుంటూరు జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి, గద్దె శ్రీహరి, నాదెళ్ల చంద్రశేఖర్, మందాళ ప్రదీప్ రెడ్డి, కళ్లం శ్రీనివాసరెడ్డి, యు.హనుమాన్‌ప్రసాద్ పాల్గొన్నారు.

క్రోధి నామ సంవత్సర ఉగాది కవి సమ్మేళనం



కవి సమ్మేళనంలో సత్కారం పొందిన కవులు



పంచాంగ శ్రవణంలో ఎమ్మెల్యే శివకుమార్ తదితరులు



పంచాంగ పఠనం చేస్తున్న చార్యులు

తెనాలిటౌన్: క్రోధి నామ సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా కొత్తపేటలోని అదితి కాన్ఫరెన్స్ హాలులో అభ్యుదయ కళా సమితి, ఇస్కఫ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఉగాది కవి సమ్మేళనం బుధవారం నిర్వహించారు. సాహితీ సాంస్కృతిక సమావేశాలతో పాటు 40 మంది కవులు సమ్మేళనంలో కవితలు గానం చేశారు. లలిత సంగీత విభావరిలో అనురాధ, కన్నెగంటి మౌనిక, బెజ్జంకి నాగమణి, నీలాంబరం, విజయసారధిలు ఉగాది గేయాలు ఆలపించారు. బాలలు ఉగాది గేయరూపకం ప్రదర్శించారు. సాంస్కృతిక, జానపద కళారూపాలపై చర్చ నిర్వహించారు. కార్యక్రమానికి డాక్టర్ రంగిశెట్టి రమేష్, ప్రొఫెసర్ లలితానంద ప్రసాద్, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావులు అధ్యక్ష వర్గంగా వ్యవహించారు. కార్యక్రమంలో తన్నీరు శివశంకర్, పొన్నెపల్లి గోపాలకృష్ణమూర్తి, ఎం.వి.రఘునాధరావు, వి.భీమేశ్వరరావు, బొల్లిముంత కృష్ణ, వియయ సారధి, కృష్ణారావు, లక్ష్మణరావు, అనురాధ, అలపర్తి వెంకటేశ్వరరావు, పవన్‌కుమార్, విజయమాధవి, పార్వతి, యేహాను, తదితరులు పాల్గొన్నారు.

- బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో కొత్తపేటలోని తాలూకా జూనియర్ కాలేజి ఆవరణలో ఉగాది వేడుకలు మంగళవారం జరిపారు. బ్రహ్మశ్రీ జి.వి.ఎల్.ఎన్.చార్యులు పంచాంగ శ్రవణం చేశారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, బ్రాహ్మణ పరిషత్ కార్యదర్శి పురుషోత్తమ్మ శర్మ, పరిషత్ నాయకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వైభవం.. ప్రతిష్టా మహోత్సవం

- కొమ్ముడప్పుల నృత్యాల నడుమ అంకమ్మతల్లి గ్రామోత్సవం
- అన్ని ఆలయాల జలప్రసాదంతో శాస్త్రోక్తంగా జలాధీశం



ప్రత్యేక పూజల్లో భక్తులు

ప్రత్తిపాడు: వేద మంత్రోచ్చారణలతో ప్రత్తిపాడు మార్మోగిపోతుంది. అంకమ్మతల్లి దేవాలయ ప్రతిష్టా మహోత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం 9.05 గంటలకు బాలాలయం నుంచి వెలుపలకు అంకమ్మతల్లిని ఆహ్వానించారు. పది గంటల నుంచి మధ్యాహ్నం వరకు విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాసన, రక్షాబంధనం, వాస్తుపూజ, అగ్నిస్థాపన హోమం, యంత్ర నమస్కారాలు, యజ్ఞశాల ప్రవేశం, అఖండస్థాపన, అంకురార్పణ శాస్త్రోక్తంగా జరిపించారు.

గ్రామోత్సవంగా అంకమ్మతల్లి..

సాయంత్రం అంకమ్మతల్లి గ్రామోత్సవంగా గ్రామ పురవీధుల్లోకి తరలివచ్చారు. పోతురాజుల కొలుపులతో మాతంగి వేషధారిణి వాక్కుతో, కొమ్ముడప్పుల నృత్యాలు, కోలాట నృత్యాలు, భక్తజన సందోహం నడుమ గ్రామోత్సవం జరిగింది. ఆలయం నుంచి ప్రారంభమైన గ్రామోత్సవం పరమేశ్వరస్వామి ఆలయం, కోదండ రామాలయం, రజక రామాలయం, శాలివాహన, రెడ్ల రామాలయాలు, అద్దంకమ్మ తల్లి, పోతురాజుమిట్ట మీదుగా సాగింది. మహిళలు అమ్మవారికి వారులు పోసి హారతులిచ్చి కొబ్బరికాయలు కొట్టారు. రాత్రి అన్ని దేవాలయాల నుంచి జలప్రసాదాన్ని సేకరించి జలాధీశం కార్యక్రమం నేత్రపర్వంగా చేశారు. జలాధీశానికి భక్తులు తమ నివాసాల నుంచి జలాన్ని సమర్పించారు.

వాహన తనిఖీల్లో రూ. లక్ష స్వాధీనం

ప్రత్తిపాడు: వాహన తనిఖీల్లో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్ రూ.లక్ష స్వాధీనం చేసుకున్న ఘటన మండలంలో చోటుచేసుకుంది. ప్రత్తిపాడు ఎస్ఐ వి.సోమేశ్వరరావు తెలిపిన ప్రకారం.. పల్నాడు జిల్లా నరసరావుపేట మల్లయ్య సెంటరుకు చెందిన ఆతుకూరి ప్రసాద్ ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా, ఎటువంటి రశీదులు లేకుండా తన కారులో రూ.లక్ష తీసుకువెళుతున్నాడు. ప్రత్తిపాడు మండలం, నడింపాలెం 16వ నంబరు జాతీయ రహదారిపైనున్న అంతర్ జిల్లా పోలీస్ చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులు కారులో నగదు గుర్తించారు. నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.